క్లుప్తంగా

ఆహార పొట్లాల పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని దేవస్థానం సెంటర్ వద్ద ఏపీ ఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాచకులకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు మాట్లాడుతూ తన కుమారుడు శివ జన్మదినం సందర్భంగా భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, భగీరథ ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ఏపీఎస్పీ రిటైర్డ్ పోలీసు ఆఫీసర్లు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారని అన్నారు. వీకె గోవర్ధనవవు, చిన్న తిరుపతి నాయుడు, గోవిందయ్య, సుబ్బారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్. శివశంకరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

95 మందికి కంటి పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్య సిబ్బంది శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 95 మందికి సిబ్బంది పరీక్షలు చేశారు. వారిలో 40మంది శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ రవికాంత్ తెలిపారు. వారిని సాయంత్రం వాహనంలో శంకర కంటి వైద్యశాలకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించి, అనంతరం గ్రామంలో వాహనంలో దించుతామని చెప్పారు. కార్యక్రమాన్ని జెట్టి, సుబ్బారావు, అన్నవరపు శేషశాయిలు పర్యవేక్షించారు, వైద్యశాల సిబ్బంది అనూహ్య, సుధీర పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారికి శుక్రవారం సీఎం సహాయ నిధి నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ మంగళగిరి పట్టణ పరిధిలోని 18వ వార్డుకు చెందిన ఉప్పల మల్లేశ్వరికి రూ.1.60 లక్షలు, ఉండవల్లి గ్రామానికి చెందిన జొన్నా హరితకు రూ.1.05లక్షలు విలువ గల చెక్కులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రిజాయ్, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, కారంపూడి చిరంజీవి, దామర్ల రాంబాబు, అందె మురళి, గాదె వినయ్, శనకా బుజ్జి, కూనపురెడ్డి రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి

ఫిరంగిపురం: రక్త హీనత నివారణకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 135 మందికి బీపీ, షుగరు, థైరాయిడ్, రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలలో రక్త హీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎటువంటి ఆహారం తీసుకోవడం ద్వారా రక్తశాతం పెరుగుతుందనే దానిపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు , బాలింతలు తమ ఆహారంలో తృణ ధాన్యాలుతో పాటు, పాలు, ఆకుకూరలు, గ్రుడ్లు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తగిన మందులు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆర్, ఆంథోనిరాణి, మేల్ అసిస్టెంట్ బాబురావు, ఆశాకార్యకర్తలు పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.

గుంటూరుకు చేరిన మాదిగల కృతజ్ఞత యాత్ర

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ చెప్పారు. రాష్ట్రంలో వర్గీకరణ సాధన దిశగా ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 16 నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రారంభమైన మాదిగల కృతజ్ఞత యాత్ర శుక్రవారం గుంటూరుకు చేరింది. ఈ మేరకు లాడ్జిసెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. కార్యక్రమంలో నవ్యమాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేజేండ్ల సుబ్బారావు, కె.వెంకట్రావు, అశోక్, బసవరాజు, కిరణ్ పాల్గొన్నారు.

డిపాజిట్‌లు చెల్లించే నాథుడెవరు?



ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న దుకాణాలు

తాడికొండ: నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో ప్రధాన రహదారిపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నిర్మించిన దుకాణాలు ఏడేళ్లుగా మూతపడి ఉన్నాయి. వాటికి డిపాజిట్ చెల్లించే నాథుడెవరని అని గ్రామస్తులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ దుకాణాలను అప్పటి పాలకవర్గం పంచాయతీ, ఇతర విభాగాల అనుమతులు, టెక్నికల్ శాంక్షన్లు లేకుండా అడ్డగోలుగా నిర్మించి, ప్రారంభోత్సవం చేసేందుకు యత్నించింది. తమ అనునాయులకు కట్టబెట్టేందుకు అప్పటి సర్పంచ్ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1.50 లక్షల చొప్పున వసూలు చేసి, పంచాయతీలో జమ చేయకుండా నిర్మాణం పూర్తి చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు తప్పును కప్పిపుచ్చుకునేందుకు దొడ్డిదారిలో 2017 ఫిబ్రవరి 27న పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు తీర్మానం చేశారు. ఈ తీర్మానంలో దుకాణాలు కట్టబెట్టాలనుకుంటున్న వ్యక్తులు.. ఎప్పటి నుంచో ఈ ప్రాంతంలో ఆక్రమణలో ఉండి వ్యాపారాలు చేసుకుంటున్నారని చూపించారు. పంచాయతీ వద్ద నిధులు లేనందున, డిపాజిట్ నిధులు చెల్లిస్తామని చెప్పినందున వారి నుంచి నగదు తీసుకొని నిర్మాణం చేసి, అప్పు పూర్తయ్యేంత వరకు నెలకు రూ.4 వేల చొప్పున అద్దెను మినహాయించుకునేలా తీర్మానం చేశారు. ఏడాదికి రూ.500 చొప్పున అద్దెను పెంచుతూ వారికే 10 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేలా పంచాయతీ తీర్మానంలో పొందుపరచడం విశేషం. అయితే లీజుకు కట్టబెట్టాలనుకున్న తమ అనునాయులు ఇచ్చిన రూ.1.50 లక్షల చొప్పున చెల్లించిన రూ.6 లక్షల నగదు మాత్రం ఎక్కడా పంచాయతీ ఖాతాలో జమచేసిన దాఖలాలు లేని కారణంగా అప్పట్లో ఈ విషయం పత్రికల్లో రావడంతో దుకాణాలకు సీల్ వేశారు. తదనంతరం దుకాణాలు తమకు ఇవ్వాలని కోరుతున్న వ్యక్తులు పంచాయతీ తీర్మానాన్ని అడ్డుపెట్టుకొని కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు తీర్పునిచ్చింది. డిపాజిట్ అధికారికంగా చెల్లించిన వ్యక్తులకు దుకాణాలు ఇవ్వాలి అని ' తీర్పులో పేర్కొంది. నిబంధనల ప్రకారం పంచాయతీ నిర్మించిన దుకాణాలను బహిరంగ వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ గత పాలకులు చేసిన తప్పుల కారణంగా అడ్డదారుల్లో నగదు వసూలు చేసి జేబులు నింపుకున్నప్పటికీ కోర్టు తీర్పును శిరసావహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే డిపాజిట్ వ్యవహారంపై పంచాయతీ అధికారులు ఒప్పంద పత్రం రాయించేందుకు యత్నిస్తుండటంతో బాధ్యులెవరూ ముందుకు రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే పత్రికలలో కథనాలు రావడంతో కార్యదర్శి డీఎల్‌పీవో దృష్టికి వ్యవహారం చేరింది. అయన తీసుకునే నిర్ణయాన్ని బట్టి దుకాణాలు తెరవాలా వద్దా అనేది తేలాల్సి ఉన్న నేపథ్యంలో గత పాలకులు జేబులు నింపుకున్న డిపాజిట్ నగదు రూ.6 లక్షలు ఎవరు చెల్లిస్తారు అనేది మీమాంసగా మారింది. కోర్టు తీర్పును శిరసావహించి ఇప్పటికైనా నగదు పంచాయతీ ఖాతాలో జమచేస్తారా లేక అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఒప్పంద పత్రంతో మమ అనిపిస్తారా అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో పంచాయతీ దుకాణాల వ్యవహారం తాడికొండ మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.

దీనిపై పంచాయతీ కార్యదర్శి హరిబాబును వివరణ కోరగా గత పంచాయతీ సర్పంచ్‌ను దుకాణాల విషయంలో నగదు చెల్లింపు లేదా ఒప్పంద పత్రం రాసేందుకు రావాలని తెలియజేశామని, డీఎల్‌పీవో గారి దృష్టిలో కూడా ఈ విషయాన్ని పెట్టినందున వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పాస్టర్స్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం లంక గ్రామంలో శుక్రవారం వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ నిర్వహించారు. లంక గ్రామంలో స్థానిక సేవకులు పులి నతానియేలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ జాన్ బాబు, క్యాపిటల్ రీజియన్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ బి.రవి ప్రకాష్, జి.ప్రకాష్, జి.విజయ్ ప్రకాష్, కె.ఏలియా, పి.ఆనంద్, డాక్టర్ వడ్లమూడి శ్రీనివాసరావు, మాజీ మైనార్టీ కమీషన్ చైర్మన్ ప్రసాదరావు జాన్‌బాబు, విజయ్ ప్రకాష్, ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మికుల న్యాయమైన పోరాటానికి సీపీఎం మద్దతు



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ కార్యాలయం వద్ద కార్మిక నాయకులు కూరపాటి స్టీఫెన్ అధ్యక్షత జరిగిన విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికులకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించకుండా సెంటు భూమి కూడా ఇక్కడి నుంచి ఎవరూ కదిలించలేరన్నారు. కార్మిక వర్గం కుటుంబ సభ్యులతో కలసి ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేబర్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టులో కార్మికులు గెలిచినా, ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నిజంగా కార్మికుల మీద ప్రేమ ఉంటే మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ లాక్ అవుట్ ప్రకటించే నాటికి అప్పటికి ఆ నెల పనిచేసిన జీతం కూడా యాజమాన్యం ఇవ్వలేదంటే మానవత్వం అనేది వీరికి ఉందా అని ప్రశ్నించారు. ఈ నెల 27న కార్మిక వర్గం మొత్తం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లోకి దిగి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందుకు సీపీఎం పూర్తి అండదండలిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్‌కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి, యూనియన్ నాయకులు కూరపాటి స్టీఫెన్, కార్మికులు పాల్గొన్నారు.

హాజరు లేదనా.. ఫీజు రీయింబర్స్ కాలేదనా!

- విశ్వభారతి ఫార్మసీ కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- హాజరు లేదని నాలుగో సంవత్సరం విద్యార్థులకు హాల్ టికెట్ల నిరాకరణ
- ఇప్పటి వరకు ఎందుకు చెప్పలేదని నిలదీసిన తల్లిదండ్రులు
- ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేయకపోవడమే.. అసలు కారణమని ఆరోపణ



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ఎస్ఎఫ్ఐ నాయకులను స్టేషన్‌కు తరలింపు..

మేడికొండూరు: రెండు రోజుల నుంచి పేరేచర్ల సమీపంలోని విశ్వభారతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ధర్నా చేస్తున్నప్పటికీ కళాశాల యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. సోమవారం నుంచి విద్యార్థులకు నాల్గో సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా 22 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు చేయకపోవడంతో తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం ఆందోళన చేశారు. కళాశాల సిబ్బంది నచ్చజెప్పినప్పటికీ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నీటి పర్యంతంతో రెండు రోజుల నుంచి అన్నం కూడా తినకుండా ఇద్దరు విద్యార్థినులు స్పృహ తప్పి పడిపోయారు. కళాశాలకు సంబంధించిన 42 మంది విద్యార్థుల్లో 22 మందికి హాజరు నిబంధనలతో యాజమాన్యం హాల్ టికెట్లు ఇవ్వలేదు. దీంతో పరీక్షలు రాయకుండా అడ్డుకున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తూ కాలేజీ ఆవరణలో ఎస్ఎఫ్ఐ నాయకులతో ఆందోళన చేశారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కళాశాల వద్దకు వచ్చినా యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడంతో కళాశాలలో ఉద్రిక్తతకు దారి తీసింది. కేవలం డబ్బు కోసమే కళాశాలను ఏర్పాటు చేసినట్లు ఉందని పలువురు ఆరోపించారు. తమకు విద్యార్థుల హాజరు శాతాన్ని ఇప్పటివరకు తమకు ఎందుకు తెలియజేయలేదని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించనందునే విద్యార్థులను పరీక్షలు రాయకుండా విశ్వ భారతి కాలేజీ యాజమాన్యం అడ్డుకుంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ముందుగా తమకు తెలియజేయవలసిన యాజమాన్యం పరీక్షలను రాయకుండా అడ్డుకోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారైనట్లు తల్లిదండ్రుల కంట నీరు పెట్టుకున్నారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ



డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ సోమ్‌లాల్



రక్తదానం చేస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్ : రక్తదానం ప్రాణాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని కేఎల్ యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ బ్యాంక్, కేఎల్‌యూ యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాని శిబిరాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో రక్తదానంపై ఉన్నతమైన అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 200 యూనిట్ల రక్తాన్ని సేకరించామని తెలిపారు. ప్రతి ఒక్కరు సంవత్సరంలో ఒక్కసారి అయినా రక్తదానం చేయాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం రక్తదాతలకు సరిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ కళాశాల పరీక్షల విభాగం ముఖ్య పర్యవేక్షణ అధికారి డాక్టర్ సోమ్‌లాల్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, గుంటూరు జిల్లా బ్లడ్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్కే జానీ రసూల్, మురళీమోహన్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ సుభాకర్ రాజు అభినందించారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్పీ ఏడీజీ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరో మనిషి ప్రాణాన్ని రక్షించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదిలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం సీహెచ్ శ్రీకాంత్ రక్తదానం చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ బి. రాజకుమారి, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, బెటాలియన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలేకూరి ప్రసాద్‌కు ఘన నివాళి



నెహ్రూనగర్: దళిత బహుజన సిద్ధాంత హక్కుల కోసం విప్లవ ఉద్యమ నాయకుడిగా ఎదిగి కవులకు, కళాకారులకు ఆదర్శంగా నిలిచిన గొప్ప కవి కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో కలేకూరి 53వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమకారుడిగా, రాజకీయ విశ్లేషకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయినట్లు చెప్పారు. హిందూ మతోన్మాద, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించిన ఉక్కు మనిషి కలేకూరి అని కొనియాడారు. కారంచేడు ఉద్యమం నుంచి నేటి లక్ష్మీపేట పోరాటం వరకు క్రియాశీలకంగా అన్ని దళిత ఉద్యమాల్లో తన వంతు ఉద్యమ సహకారిగా కలేకూరి కొనసాగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, శిఖా సురేష్, కోటేశ్వరరావు, తాటికొండ నరసింహరావు, ముత్తయ్య, కైలా జయసుధ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

3న ధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వక్ఫ్ పరిరక్షణ మహా సభ కార్యవర్గం

తాడేపల్లిరూరల్ : విజయవాడ కుమ్మరిపాలెంలో నవంబర్ 3న జరుగనున్న వక్ఫ్ పరిరక్షణ మహా సభను జయప్రదం చేయాలని వక్ఫ్ పరిరక్షణ మహా సభ కన్వీనర్ సయ్యద్ లూఖ్మాన్ ఫార్దిలీత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఐబీఎస్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టం 2013లో సవరణలు చేయడానికి నిర్ణయించుకుందని, దాని ఫలితంగా అనేక మార్పులు చేర్పులు ముందుకు వచ్చాయన్నారు. వక్ఫ్ బోర్డు సీఈఓ ముస్లింలు అయి ఉండాలనే షరతు ఉందని, దీన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ముస్లిమేతర అధికారిని సీఈఓగా నియమించుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ పరిరక్షణ మహా సభను విజయవాడ కుమ్మరిపాలెం ఈద్గా మైదానంలో జమా అతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వక్ఫ్ పరిరోణ (తహఫ్ఫుజ్ ఎ అవ్‌కాఫ్) పేరుతో భారీ మహాసభ నిర్వహించనున్నామని చెప్పారు. ఈ మహాసభను జయప్రదం చేయాలన్నారు. అనంతరం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీమ్, మంగళగిరి వక్ఫ్ పరిరక్షణ మహా సభ కన్వీనర్ ముహమ్మద్ యాసుఫ్, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నెహ్రూనగర్: ఎన్డీఏ ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదింపజేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఏసుబాబు తెలిపారు. శుక్రవారం కాకాని రోడ్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళితుల్లో అత్యధికంగా వెనుకబడిన కులాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో మంద కృష్ణ మాదిగ చేస్తున్న వర్గీకరణ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. సమావేశంలో సంఘ నాయకులు సుబ్బయ్య, మక్కెన ప్రభాకర్, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

వర్ధమాన దేశాల ఆకాంక్షలు నెరవేర్చాలి

లక్ష్మీపురం: అగ్ర రాజ్యాలపై పెత్తందారీ పోకడలను అడ్డుకుంటూ వర్ధమాన దేశాల ఆకాంక్షలను నెరవేర్చగలిగితేనే బ్రిక్స్‌కి సార్థకత చేకూరుతుందని విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణం కోసం ఆవిర్భవించిన బ్రిక్స్ కూటమి విశ్వప్రగతి, భద్రత కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి మాట్లాడారు.

వస్త్ర దుకాణంలో చోరీ

పట్నంబజారు: వస్త్ర దుకాణంలో చోరీ ఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరుకు చెందిన యల్లావుల అశోక్, ఉమెన్స్ కళాశాల రోడ్డులో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ఎప్పటిలాగానే దుకాణాన్ని మూసి వెళ్లిపోయాడు. తిరిగి శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షాపులో దుస్తులు కనిపించకపోవడం గమనించాడు. రూ.2 లక్షల విలువ చేసే దుస్తులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సీసీ పుటేజ్‌లో చోరీ చేసిన నిందితులు స్పష్టంగా కనబడింది. దుస్తులతోపాటు కొద్దిమేర నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తూములూరు(కొల్లిపర): చివలూరు గ్రామం శివారులో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తూములూరు గ్రామానికి చెందిన వింత మహేశ్వర రెడ్డి (45) అనే వ్యక్తి నందివెలుగులో డాల్ మిల్‌లో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో చివలూరు గ్రామ సమీపంలో రోడ్డు మరమ్మతుల కోసం తోలిన గ్రావెల్ గుట్టను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమై.. అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగణన సర్వేపై అవగాహన అవసరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నాగమల్లేశ్వరి

ఫిరంగిపురం: పశు గణన సర్వేపై ప్రజలకు అవగాహన అవసరమని సర్పంచ్ సి.నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో శుక్రవారం పశుగణన సర్వే కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్ల కోమారు కేంద్ర ప్రభుత్వం 21వ అఖిల భారత పశుగణన సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిలో ఈ రోజు నుంచి ప్రతి గ్రామంలో లైవ్‌స్టాక్ సెన్సెస్ ఎన్యుమరేటర్లు, ఏహెచ్ఏలు ఇంటింటికి వెళ్లి పశువులు, జీవాలు, ఇతర జంతువుల సంఖ్యను యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. దాని ద్వారా పశువులకు సంబంధించి వ్యాక్సిన్లు, కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు, నట్టల నివారణ మందు, కోళ్లకు సంబంధించిన వ్యాక్సిన్లు, కుక్కలకు సంబంధించి రేబిస్ వ్యాక్సిన్లు, పథకాలు అందేలా చేయడం జరుగుతుందన్నారు. గణన ద్వారా అంతరించిన జంతువుల వివరాలు తెలుసుకుని వాటి సంఖ్య పెంచేందుకు ఉపకరిస్తాయని చెప్పారు. ఫిబ్రవరి 28 వరకు గణన ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. పశు గణనకు తగినట్లుగా పశువైద్య సిబ్బందిని పెంచేందుకు ఉపకరిస్తాయని తెలిపారు.అన్ని గ్రామాల్లో కరపత్రాలను ఆయాగ్రామాల సర్పంచులు, నాయకులు ఆవిష్కరించినట్లు చెప్పారు. అనంతరం పశుగణన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.చౌడయ్య , సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొల్లిపర: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ పి.కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో, దావులూరు అడ్డరోడ్డు వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి సమయంలో వాహనాలు అతి వేగంగా నపకుండా రోడ్డు పై ఏమైనా అటంకాలు, గుంతలు ఉన్నాయా అన్న అంశాలను పరిశీలించుకుంటూ బైకును నడపాలన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో ఎళ్ల వేళలా తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలన్నారు. రాత్రి, పగలు ఎప్పుడూ మద్యం సేవించి వాహనం నడపడం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహన ఆర్‌సీ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.